
సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం


ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు భద్రాచలానికి చెందిన పేరిశెట్టి వీర వెంకట శ్రీరామచంద్రమూర్తి శనివారం రూ.1,05,055 విరాళం సమర్పించారు.



వాడపల్లి వాసా.. శ్రీ వేంకటేశా..

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి దివ్యక్షేత్రాన.. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 2,52,765 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే, తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీస్

పెరవలి: ఐసీడీఎస్ పెరవలి సూపర్‌వైజర్ వనజాక్షికి శనివారం ఆ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నుంచి షోకాజ్ నోటీస్ వచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఈ నెల 16న అక్రమంగా రేషన్ సరుకులు తీసుకువెళుతుండగా ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు పట్టుకున్న విషయం విదితమే. అక్రమాలకు పాల్పడిన వనజాక్షిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాల్సిందిగా ఆ షోకాజ్ నోటీసులో పేర్కొన్నట్టు సమాచారం. వనజాక్షి అక్రమాలకు పాల్పడినట్టు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ప్రాథమికంగా ధ్రువీకరించారు. దీనిపై అడిషనల్ సీడీపీఓ పద్మావతి విచారణ జరపగా వనజాక్షి అక్రమాలకు పాల్పడినట్టు పలువురు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు కూడా చేశారు. ఈ క్రమంలో వనజాక్షికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

సీఎం జగన్ ఆశయాల మేరకు పనిచేయాలి



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న పార్టీ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగనన్న ఆశయాల మేరకు పనిచేస్తూ, పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో స్థానం పొందిన పలువురు నాయకులు శనివారం రాజమహేంద్రవరంలో జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వారిలో జిల్లా పార్టీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ నంకెళ్ల బాబూరావు, సెక్రటరీలు తాడికొండ విష్ణుమూర్తి, పబ్బినీ ప్రసాద్ ఉన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ కష్టపడిన ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందన్నారు. పదవులు వచ్చినవారు మరింత బాధ్యతతో కష్టపడి పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు 55 మందితో జిల్లా పార్టీ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కమిటీ సభ్యులతో కలిసి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సీఎం సహాయ నిధి నుంచి రూ.7 లక్షల సాయం



ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం లెటర్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు/చాగల్లు: ఏలూరు జిల్లా పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన కట్టూరి కొండయ్య భార్య దుర్గ గుండె వ్యాధి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. ఏడు లక్షలు విడుదల అయ్యాయి. ఈ మొత్తానికి లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం వారి కుటుంబ సభ్యులను అందజేశారు. ప్రస్తుతం దుర్గ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండలశాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

తెలుగుకు వెలుగు

- మన భాషపై సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రత్యేక ముద్ర
- ఈ విశేష గ్రంథం పుట్టిల్లు మన పిఠాపురమే
- నిఘంటువుల్లో ఇప్పటికీ దీనిదే అగ్రస్థానం
- 29న తెలుగు భాషా దినోత్సవం

సండే స్పెషల్

పిఠాపురం: వాడుక భాష ఉద్యమానికి ఆద్యుడు గిడుగు రామమూర్తి. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి.. ఆ తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసిన ఆయన కృషి ఎనలేనిది. ఆయన సేవలకు గుర్తింపుగా గిడుగు జయంతినే తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నాం. ఈ నెల 29న ఆ మహనీయుని జయంతి. ఈ సందర్భంగా తెలుగు భాషపై విశేష ముద్ర వేసుకున్న సూర్యారాయాంధ్ర నిఘంటువు (తెలుగు పదకోశం) పుట్టుపూర్వోత్తరాలను ఒకసారి మననం చేసుకుంటే..

తెలుగులో చాలా నిఘంటువులు వచ్చాయి. ఎన్ని ఉన్నా పిఠాపురం కేంద్రంగా ఆవిర్భవించిన సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రత్యేకతే వేరు. 1911 మే 12న పిఠాపురం మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ సంపూర్ణ నిఘంటువు తయారు చేయిస్తానని ప్రకటించారు. ఇందులో భాగంగా వేదం వెంకటరాయశాస్త్రి సంపాదకులుగా మద్రాసులో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టారు. నిఘంటువు తయారీకి 1918లో పిఠాపురంలో భవనం నిర్మించగా.. మద్రాసు నుంచి పిఠాపురం రావడానికి వేదం వెంకటరాయశాస్త్రి అంగీకరించలేదు. దీంతో సంపాదక బాధ్యతను జయంతి రామయ్య పంతులుకు అప్పగించారు. అప్పట్లోనే ఈ నిఘంటువు తయారీకి రూ.20 లక్షలు ఖర్చయినట్లు తెలుస్తోంది. మొదటి సంపుటాన్ని ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ఉపకులపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ 1936లో ఆవిష్కరించారు. అప్పటి నుంచి వరుసగా ఏడు సంపుటాలు వెలువడింది. 1972లో చివరి సంపుటి వెలువడింది. ఈ నిఘంటువులోని భాష ఆధారంగానే నేటికీ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు రూపొందిస్తుండటం విశేషం.

నిఘంటువు తయారీలో..


సూర్యరాయాంధ్ర నిఘంటువు తయారీలో జయంతి రామయ్య పంతులుతో పాటు కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రి, తంజానగరం తేవప్పెరు మాళ్లయ్య, పురాణానంద మల్లయ్యశాస్త్రి, పేరి పాపయ్యశాస్త్రి, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి, కూచి నరసింహమూర్తి, పీసుపాటి చిదంబరశాస్త్రి, చర్ల నారాయణశాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, దర్భా సర్వేశ్వరశాస్త్రి తదితర 40 మంది పండితులు పాలు పంచుకున్నారు. అప్పటి వరకూ వచ్చిన అన్ని నిఘంటువుల కంటే ఇదే చరిత్రలో నిలిచిపోయి తెలుగు భాషకు వన్నె తెచ్చింది.

భాషా వికాసానికి మూలం



భావ వ్యక్తీకరణకు భాష ఏర్పడింది. క్రమేపీ భాష గ్రాంథికంగా.. తర్వాత వ్యవహారికంగా విడిపోయింది. గ్రాంథికమైన శిష్ట వ్యావహారికంలోనే సాహిత్యం వెలువరించడానికి ఆనాటి పండితులు మొగ్గు చూపారు. అయితే అందరికీ అర్థమయ్యే రీతిలో వ్యవహారిక భాషలో సాహిత్యం రావాలని గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావు తపన పడ్డారు. ఆ దిశగా కృషి చేశారు. వీరి కృషికి పిఠాపురం రాజా తయారు చేయించిన సూర్యరాయాంధ్ర నిఘంటువు తోడై తెలుగు భాషకు వన్నె తెచ్చింది.

– ర్యాలి ప్రసాద్,
పిఠాపురం చరిత్ర రచయిత, పిఠాపురం



అర్థమే కాదు పరమార్థం కూడా..



పదానికి అర్థంతో పాటు దానిని ఏ కవి ఏ గ్రంథంలో ఏ పద్యంలో ఉపయోగించారు వంటి వివరాలు చెప్పేది సూర్యరాయాంధ్ర నిఘంటువు. పదం సరైనదా.. కాదా.. దాని రూపం ఏమిటి వంటి విషయాలు తెలుసుకోవడానికి నిఘంటువు కచ్చితంగా అవసరమవుతుంది. ఇవి ప్రతి భాషలోనూ ఉంటాయి. తెలుగులోనూ చాలా ఉన్నాయి. కానీ అత్యంత ప్రామాణికమైనది మాత్రం సూర్యరాయాంధ్ర నిఘంటువు మాత్రమే. దీనిని చాలా మంది పండితులు ఇక్కడకు వచ్చి ఏళ్ల తరబడి శ్రమించి తయారు చేశారు. నిఘంటువులన్నిటిలోనూ ఇది తలమానికం. అలాంటిది మన పిఠాపురంలో తయారు కావడం అదృష్టంగా చెప్పవచ్చు.

– వారణాశి కామేశ్వరశర్మ, పండితులు, పిఠాపురం



చరిత్రలో నిలిచిపోయింది




ప్రపంచ దేశాల్లోని వివిధ ప్రాంతాల్లో తెలుగు భాషకు మూలం పిఠాపురంలో ఉంటుంది. పిఠాపురం మహారాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ కవులకు ఇచ్చిన ప్రాధాన్యం తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించింది. తెలుగును సంపూర్ణంగా తెలుసుకోవాలంటే సూర్యరాయాంధ్ర నిఘంటువు చదవాల్సిందే. ఎందరో కవులు దీని కోసం పిఠాపురం వస్తుంటారు. ఇది మా వద్ద ఉండటంతో మా గ్రంథాలయానికి ఎంతో గుర్తింపు వచ్చింది.

– కొండేపూడి శంకరరావు, కార్యదర్శి, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పిఠాపురం



పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సూర్యరాయాంధ్ర నిఘంటువులు



సూర్యరాయాంధ్ర నిఘంటువులు

రోగులకు మెరుగైన వైద్య సేవలు

జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

అనపర్తి: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు, వైద్య ఆరోగ్య సేవలు–సామర్థ్యంపై శనివారం స్థానిక వర్తక సంఘం కల్యాణ మంటపంలో అనపర్తి ఏరియా ఆసుపత్రి, కడియం సీహెచ్‌సీ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వైద్య రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోందన్నారు. ఆసుపత్రుల్లో నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకుని వైద్య సేవలు అందించాలన్నారు. తద్వారా ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని సూచించారు. మాతా, శిశుమరణాల నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు క్రమం తప్పకుండా తమ క్లస్టర్ పరిధిలో గర్భిణుల ఇళ్లను సందర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలపై గర్భిణులకు, వారి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించి ప్రసవాలన్నీ ప్రభుత్వాసుపత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త మార్గదర్శకాలను అనుసరించి గర్భిణులకు రెండు సార్లు టిఫా స్కానింగ్ చేయించాల్సి ఉంటుందని సూచించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ జి.వరలక్ష్మి, డాక్టర్ ప్రమీల, కడియం సీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మోహనవంశీ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు తీపికబురు

- ఈ నెల నుంచి జీతాల పెరుగుదల
- వచ్చే నెల నుంచి ఉద్యోగుల ఖాతాల్లోకి...
- బేసిక్ మీద 23 శాతం పెంపు
- జిల్లాలో 89 మందికి లబ్ధి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో పనిచేసే గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచింది. సెర్ప్ పరిధిలో వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేసే ఈ ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ల ఉన్నతికి విశేషంగా కృషి చేస్తున్నారు. అయితే పనికి తగిన జీతం రావడం లేదని వీరు కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరి జీతాలు పెంచుతూ ఈనెలలో జీవో 64ను విడుదల చేసింది. బేసిస్ జీతంపై ఏకంగా 23 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన ఈ జీతం ఆగస్టు ఒకటి నుంచి వర్తింప చేస్తున్నట్టు ప్రభుత్వం జీవోలో పేర్కొంది. దీనితో సెప్టెంబర్‌లో వచ్చే జీతం పెరగుతుండడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో కీలకం

జిల్లా డీఆర్‌డీఏ–వెలుగు క్రాంతిపథంలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల అభివృద్ధిలో సెర్ప్ పరిధిలో పనిచేసే ఉద్యోగులు కీలకంగా ఉన్నారు. వీరిలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ (డీఎంపీ), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో ఆర్డినేటర్ (సీసీ)లు, అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ) ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి కూడా పనిచేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీల అభ్యున్నతికి వీరు కృషి కృషి చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతోపాటు వాయిదాలు కట్టించడం, స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వడం, ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు చేసే వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలైన జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న పాలవెల్లువ, ఉన్నతి వంటి పథకాలను మహిళల వద్దకు తీసుకుని వెళ్లి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. వారి వ్యాపారాలకు మార్కెటింగ్ అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ–యానిమేటర్ల)ను సమన్వయం చేసుకుని సంఘాల ఉన్నతికి కృషి చేస్తున్నారు.



జీతాల పెంపు నేపథ్యంలో సెర్ప్ సీఈవో ఇంతియాజ్‌ను సత్కరిస్తున్న సెర్ప్ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు

సీఎం జగన్ నిర్ణయంతో సంతోషం

వీరు కొన్నేళ్లుగా తమకు జీతాలు పెంచాల్సిందిగా కోరుతూ వస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీరి వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ (డీఎంపీ)లు ఐదుగురికి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం)లు 14 మందికి, క్లస్టర్ కో ఆర్డినేటర్లు (సీసీ) 56 మందికి, అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ) ఆరుగురికి చొప్పున మొత్తం 89 మందికి జీతాలు పెరిగాయి. బేసిక్ జీతం మీద రూ. 4 వేల నుంచి రూ.12 వేల వరకూ పెరిగింది. సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న వారిలో కొందరు 2002 నుంచీ ఉన్నారు. వీరికి గతంలో ఉద్యోగ భద్రతను కల్పించింది దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖరరెడ్డి కావడం విశేషం. అప్పట్లో తండ్రి వైఎస్సార్ ఉద్యోగ భద్రత కల్పించగా, తనయుడు జగన్ 23 శాతం జీతాలు పెంచి తోడ్పాటు అందించారు.

ఆనందంగా ఉంది



మాకు 23 శాతం జీతం పెంచడం చాలా ఆనందంగా ఉంది. దీని వల్ల కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ఉత్సాహంగా పనిచేయడానికి ఇదొక అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుడికీ చేర్చేందుకు మరింత కృషి చేస్తాం. సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– మహమ్మద్ జిలానీ, ఏపీఎం, అనపర్తి మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏకంగా బేసిక్ మీద 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. సీఎం జగన్ తీసుకున్న ఈ నిర్ణయం మాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. 2005లో నేను విధుల్లో చేరాను. ఇప్పుడు నా జీతం రూ.7 వేల వరకూ పెరుగుతోంది.

– యు.బాలగంగాధర్ తిలక్,
క్లసర్ కో ఆర్డినేటర్, రాజానగరం

సీఎం జగన్ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు

నిడదవోలు : పట్టణంలో ఈనెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు వేగంగా ఏర్పాట్లను చేస్తున్నారు. నిడదవోలు సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ ఆవరణలో సభావేదిక పనులను శనివారం జాయింట్ కలెక్టర్ టి. తేజ్‌భరత్ స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడుతో కలిసి పరిశీలించారు. వైఎస్సార్ కాపునేస్తం రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు వస్తున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు ఎస్. తేజ్ భరత్ మాట్లాడుతూ సీఎం జగన్ పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు రోడ్ షో నిర్వహిస్తున్న దృష్ట్యా బ్యారికెడ్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ కోసం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వర్ష సూచనలు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ సభా వేదిక, వీవీఐపీ గ్యాలరీ, ఇతర గ్యాలరీలకు చెందిన పనులపై సూచనలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ నిడదవోలు పర్యటనలో రాష్ట్ర స్థాయి వైఎస్సార్ కాపునేస్తం రాష్ట్ర స్థాయిలో లబ్ధిదారుల ఖాతాకు నేరుగా నగదు జమ చేసే కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కొవ్వూరు ఆర్డీఓ ఎస్. మల్లిబాబు, ఎస్ఈ పిఆర్ ఏ బి వి ప్రసాద్, పీడీ డ్వామా పి. జగదాంబ, ఎస్ఈ ఆర్డబ్ల్యూఎస్ డీ. బాల శంకరరావు, నిడదవోలు, కొవ్వూరు మునిసిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, బి. శ్రీకాంత్, ఇతర జిల్లా అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సభా వేదిక పనులను పరిశీలించిన జిల్లా జేసీ ఎస్. తేజ్‌భరత్, ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు

రాజమహేంద్రవరంలో భారీ వర్షం

జిల్లాలో 27.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

కొవ్వూరు: జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయం ఎనిమిదిన్నర గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో సరాసరిన 27.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం నగరంలో గరిష్ఠంగా 75.4, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 62.4 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది.మండలాల వారీనగా కోరుకొండలో 57.4, కడియంలో 41.6, గోకవరంలో 21.4, సీతానగరంలో 9.4, రాజానగరంలో 19.4, రంగంపేటలో 18.2, బిక్కవోలులో 3.8, అనపర్తిలో 21.8, తాళ్లపూడిలో 12.0, గోపాలపురంలో 9.6, దేవరపల్లిలో 12.2, కొవ్వూరులో 37.6, చాగల్లులో 19.0, నిడదవోలులో 39.2, ఉండ్రాజవరంలో 41.8, పెరవలిలో 12.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.రానున్న ఐదు రోజుల పాటు చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచించింది. కాగా కొవ్వూరులో శనివారం భారీవర్షం కురిసింది. మండలం పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సుమారు రెండు అడుగులు లోతు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు సిబ్బందితో పాటు జనం ఇబ్బందులు పడ్డారు.కోర్టు ప్రాంగణంలోను, అగ్నిమాపక కేంద్ర ప్రాంగణం లోను భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. భారీ వర్షాలకు రాజమహేంద్ర వరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



దేవీచౌక్ సెంటర్‌లోని వరద ఉధృతి

క్లుప్తంగా

14, 15 తేదీల్లో 'నన్నయ'లో టెక్ ఫెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యాన వచ్చే నెల 14, 15 తేదీల్లో అద్విక-23 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు శనివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్లు, టెక్ క్విజ్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ప్రజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథీసిస్ డిబేట్ వంటి సాంకేతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఈ టెక్ ఫెస్ట్‌కు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా, బి.లక్ష్మి కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. లేదా 70930 08482 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

విద్యుత్ వైరు చోరీ

కొత్తపల్లి: కొమరగిరిలోని జగనన్న ఇళ్ల స్థలాల లే అవుట్ కోసం తీసుకువచ్చిన విద్యుత్ వైరు అపహరణకు గురైంది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ లే అవుట్‌లో విద్యుత్ లైన్లు బిగించేందుకు సుమారు 300 కేజీల విద్యుత్ వైరు తీసుకువచ్చారు. దీనిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ కాంట్రాక్టర్ జి.రామ్మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వాసా.. శ్రీ వేంకటేశా..

- ఘనంగా స్వామి వారి పవిత్రోత్సవాలు ప్రారంభం
- శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- రూ.34.35 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: గౌతమీ గోదావరి తీరాన.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి దివ్యక్షేత్రాన.. శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన అర్చకులు స్వామి, అమ్మవార్లను సుగంధాలు వెదజల్లే రంగురంగుల పుష్పమాలికలు.. అరటి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి, పూజల అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షధారణ, అకల్మష హోమం తదితర వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పవిత్రోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సాయంత్రం 5 గంటలకు పవిత్రారోహణం, విశేష అర్చన, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు నిర్వహించనున్నారు.

మార్మోగిన గోవింద నామం

స్వామి వారి దర్శనానికి వేలాదిగా వచ్చిన భక్తులతో వాడపల్లి క్షేత్రంలో గోవింద నామం మార్మోగింది. సుమారు 35 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.34,35,475 ఆదాయం సమకూరింది. వేలాదిగా వచ్చిన భక్తుల వాహనాలతో పార్కింగ్ స్థలం కిక్కిరిసిపోయింది. ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి



స్వామి వారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న పండితులు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

యువకుడి మృతదేహం లభ్యం



కార్తీక్ (పాతచిత్రం)

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రం స్నాన ఘట్టం వద్ద గోదావరి నదిలో ఈ నెల 24న గల్లంతైన ఇసపల కార్తీక్ మృతదేహం శనివారం ఔరంగబాద్ సమీపాన లభ్యమైంది. నదిలో స్నానానికి దిగిన భార్య భవాని ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రక్షించేందుకు నదిలోకి దిగిన కార్తీక్ గల్లంతైన విషయం తెలిసిందే. స్థానికులు భవానీని రక్షించి ఒడ్డుకు చేర్చారు. నదిలో కొట్టుకుపోయిన కార్తీక్ జాడ కోసం జాలర్ల సాయంతో కుటుంబ సభ్యులు, అగ్నిమాపక సిబ్బంది రెండు రోజులుగా నదిలో గాలించారు. కార్తీక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు వాసి. కార్తీక్ దంపతులు ఈ నెల 24న దంపతులు మోటార్ సైకిల్‌పై తణుకు వెళ్లారు. తిరిగి స్వస్థలానికి వెళ్తూ, మార్గం మధ్యలో శ్రావణ మాసం సందర్భంగా గోష్పాద క్షేత్రంలో నదీ స్నానం ఆచరించేందుకు వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనపై పట్టణ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు కేసు నమోదు చేశారు.

రత్నగిరిపై రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఓ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రకాష్ సదన్ సత్రంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న యడ్ల బుల్లెబ్బాయిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. సత్రం గదులు అద్దెకిచ్చిన సందర్భంగా కార్యాలయంలో ఉండాల్సిన నగదు కన్నా సుమారు రూ.6 వేలు తక్కువగా ఉన్నట్టు అధికారుల తనిఖీలో తేలింది. ఈ విషయాన్ని ఈఓకు నివేదించడంతో అందుకు బుల్లెబ్బాయిని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు.

'ప్రేమదేశపు యువరాణి' 2న విడుదల



మీడియా సమావేశంలో విరాట్ కార్తీక్, హీరో హీరోయిన్లు యామిన్ రాజ్, ప్రియాంక రెవ్రీ, దర్శకుడు సాయి సునీల్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరానికి చెందిన విరాట్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటించిన 'ప్రేమదేశపు యువరాణి' సినిమా వచ్చే నెల 2వ తేదీన విడుదల కానుంది. ఏజీ క్రియేషన్స్ పతాకంపై ఎస్2హెచ్2 ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా నిర్మించిన ఈ చిత్రాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 100కు పైగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ప్రమోషన్‌లో భాగంగా శనివారం రాజమహేంద్రవరం వచ్చింది. ఈ సందర్భంగా ఆనంద్ రీజెన్సీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనిట్ సభ్యులు మాట్లాడారు. కార్తీక్ మాట్లాడుతూ, జనప్రియ పచ్చళ్ల వ్యాపారం చేసే తాను హైదరాబాద్ వెళ్లిన సందర్భంగా ఈ చిత్ర డైరెక్టర్‌ను కలిసి ఆడిషన్‌కు వెళ్లి, ఈ సినిమాలో ప్రధాన పాత్రకు ఎంపికయ్యానని చెప్పారు. చిన్న బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం షూటింగ్ అంతా ఉభయ గోదావరి జిల్లాల్లోనే జరిగిందన్నారు. త్వరలో ఒక సినిమాకు దర్శకత్వం వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నానని చెప్పారు. ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వచ్చి తమ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. చిత్ర దర్శక రచయిత సాయి సునీల్ నిమ్మల మాట్లాడుతూ, ప్రేమ, ఎమోషన్స్‌తో ఈ సినిమా తీశామని చెప్పారు. పాటలకు మంచి స్పందన వచ్చిందన్నారు. హీరో హీరోయిన్లు యామిన్ రాజ్, ప్రియాంకా రెవ్రీ, విలన్ పవన్ తదితరులు కూడా మాట్లాడారు. నిర్మాతలు ఆనంద్ వేమూరి, హరిప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం



ఖాదర్ మృతితో జార్జిపేటలోని అతడి ఇంటి వద్ద విషాద ఛాయలు



ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన అన్న ఖాదర్‌ను పట్టుకుని విలపిస్తున్న బషీర్

- 216 జాతీయ రహదారిపై ఢీకొన్న రెండు బైక్‌లు
- యువకుడి మృతి.. ముగ్గురికి గాయాలు



మృతుడు షేక్ ఖాదర్ (పాత చిత్రం)

తాళ్లరేవు: అతి వేగం ఒకరి ప్రాణం తీసింది. మరో ముగ్గురిని క్షతగాత్రుల్ని చేసింది. యానాం బైపాస్‌లో గణపతి నగర్ వంతెన వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్, మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని జార్జిపేట గ్రామ పంచాయతీకి చెందిన షేక్ ఖాదర్, షేక్ అబ్దుల్లా, షేక్ బషీర్ అన్నదమ్ములు. వీరు నీలపల్లి చెక్‌పోస్టు వద్ద కోళ్ల దుకాణంలో పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కోళ్ల వ్యాను వచ్చిందనే సమాచారంతో కోళ్లను తెచ్చుకునేందుకు ఖాదర్, బషీర్ బైక్‌పై సుంకరపాలెం జంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా వీరి బైక్, అదే మార్గంలో వస్తున్న మరో బైక్ ఢీకొన్నాయి. దీంతో రెండు మోటార్ సైకిళ్లూ అదుపు తప్పాయి. ఈ ప్రమాదంలో షేక్ ఖాదర్ రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొన్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని హుటాహుటిన స్థానికులు యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఖాదర్ తమ్ముడు బషీర్‌తో పాటు మరో బైక్‌పై వెళ్తున్న యానాంకు చెందిన కర్రి రాజు, కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన గుబ్బల కాశీ ప్రసాద్ గాయపడ్డారు. వారు యానాం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

20 ఏళ్ల క్రితం తండ్రి.. నేడు కొడుకు

రోడ్డు ప్రమాదాలు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఖాదర్, అతడి సోదరుడు అబ్దుల్లా కవలలు. జార్జిపేట గ్రామానికి చెందిన హాసియా, బాషా దంపతులకు 20 ఏళ్ల క్రితం కవలలు ఖాదర్, అబ్దుల్లా జన్మించారు. అనంతరం ఆ దంపతులకు మూడో సంతానంగా బషీర్ పుట్టే సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాషా దుర్మరణం పాలయ్యాడు. తిరిగి మళ్లీ రోడ్డు ప్రమాదంలోనే కవల కొడుకుల్లో ఒకడైన ఖాదర్ మృతి చెందడం ఆ కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేస్తోంది. తనతో పాటే పుట్టి, తోడుగా పెరిగిన ఖాదర్ మృతితో అబ్దుల్లాతో పాటు అతడి కుటుంబ సభ్యులు కంటికి కడివెడుగా రోదిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో కొడుకు, మనవడిని కోల్పోయానని ఖాదర్ నానమ్మ అజ్మా బోరున విలపించింది. వారం రోజుల కిందటే కొత్త మోటార్ సైకిల్ కొన్నామని, దానిపై ఎంతో ఆనందంగా తిరుగుతున్న మనవడు ఖాదర్.. ప్రమాదానికి గురై ఇలా మృతి చెందుతాడనుకోలేదని కన్నీటిపర్యంతమవుతోంది.